
సాక్షి
ఒడిశా
శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,08,227
బంగారం	4 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
వెండి	31 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



26న అమృత్ భారత్ రైల్వేస్టేషన్లకు శంకుస్థాపన

దేశవ్యాప్తంగా రూ.41,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులను భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 26న జాతికి అంకితం చేయనున్నారు.

- 8లో



క్రీడా హబ్‌గా రాష్ట్రానికి గుర్తింపు

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒడిశా రాష్ట్రం క్రీడా హబ్‌గా గుర్తింపు పొందుతోందని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన మహిళలు

బరంపురం: ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. నగరంలోని బీజేపీ కార్యాలయంలో వివిధ వర్గాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో బీజేపీలో చేరారు. గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుభాష్ సాహు సమక్షంలో వీరంతా బీజేపీ కండువా కప్పుకున్నారు.

ఘనంగా బినాయక్ ఆచార్య జయంతి

బరంపురం: నగరంలోని వివిధ సంస్థల్లో మాజీ ముఖ్యమంత్రి దివంగత బినాయక్ ఆచార్య 99వ జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బినాయక్ ఆచార్య కళాశాల ప్రాంగణంలో కళాశాల పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఎస్‌ఎంబీటీ ప్రాంగణంలో బినాయక్ ఆచార్య జయంతి ఉత్సవాలు జరిపారు. సాయంత్రం స్థానిక గేట్ బజార్ ఎన్‌జీవో ప్రాగణంలో మానవ అధికారి సురక్షా మంచ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలపై ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో అబని కుమార్ గయా, ఏఆర్ వర్మా, రామ్‌పాత్రో తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా అమ్ముతున్న ఇద్దరు అరెస్టు



అరెస్టైన సారా వ్యాపారులు

జయపురం: నాటుసారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను జయపురం ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో ధన్‌పూర్ గ్రామ పంచాయతీ పదుగుడ గ్రామానికి చెందిన బాబుల హరిజన్(35), మరొక మహిళ ఉన్నారు. గురువారం మధ్యాహ్నం ఎక్సైజ్ సిబ్బంది పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో బాబుల హరిజన్‌తో పాటు మహిళ పట్టుబడిందని వెల్లడించారు. పెట్రోలింగ్‌లో ఏఎస్‌ఐ ప్రదీప్ కుమార్ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్యుడిపై దాడి

- బీఎస్పీ రాయగడ జిల్లా అధ్యక్షుడు జితు అరెస్టు



వైద్యుడిపై దాడి చేస్తున్న జితు

రాయగడ: జిల్లాలోని మునిగుడ పోలీసుస్టేషన్ పరిధి సకట పీహెచ్‌సీలో మెడికల్ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ సవ్యసాచి మహాపాత్రోపై బహుజన్ సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు జితు జకసిక దాడి చేశారు. ఈ మేరకు మునిగుడలో డాక్టర్ మహాపాత్రో గురువారం ఫిర్యాదు చేయడంతో జితును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం కొంతమంది మద్దతుదారులతో జితు సకట పీహెచ్‌సీకి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ వైద్య సౌకర్యాల గురించి ఆరా తీశారు. డాక్టర్ మహాపాత్రోతో జితూ దురుసుగా మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రజలకు ఎటువంటి వైద్య సౌకర్యాలు అందడం లేదని వాదించారు. అందుకు సమాధానం చెబుతున్న డాక్టర్ మహాపాత్రోపై దాడి చేశారు. అతని మద్దతుదారులు సైతం పీహెచ్‌సీ సిబ్బందిపై దాడికి దిగారు. విషయం తెలుసుకున్న జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్ గురువారం సాయంత్రం సకట పీహెచ్‌సీకి వెళ్లి దర్యాప్తు చేశారు. అనంతరం మునిగుడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసిన ఎస్పీ హరీష్ బీసి శుక్రవారం జితును అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

అదృష్టం వరించేనా..!

- రాయగడ బీజేడీ టిక్కెట్టుపై ఎమ్మెల్యే ముదులి ఆశలు
- గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం
- కలిసొచ్చిన అధికార పార్టీలో విభేదాలు
- ఈసారి గెలవాలని బీజేడీ ప్రయత్నం
- టిక్కెట్టు కేటాయింపుపై సర్వత్రా ఆసక్తి



బీజేడీ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముదులి(ఫైల్)



సీఎం నవీన్ పట్నాయక్‌తో మాట్లాడుతున్న ముదులి(ఫైల్)

రాయగడ: గత ఎన్నికల్లో రాయగడ శాసనసభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన మకరంద ముదులి, మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానే పోటీచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన మరోసారి ఇదే స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 2019లో అధికార బీజేడీ అభ్యర్థి లాల్ బిహారి హిమిరికపై 4,870 ఓట్ల మెజారిటీతో గెలిపొందారు. అయితే ఈసారి ఆయనకు ప్రజలు ఎంతవరకు మద్దతిస్తారు అన్న అంశం చర్చనీయంగా మారింది. ఈ ఎన్నికల్లో బీజేడీ టిక్కెట్టు కోసం విశ్వప్రయత్నం చేస్తున్న ముదిలి, అందుకు అనుగుణంగా గత రెండేళ్లుగా అధికార కార్యక్రమాలతో పాటు బీజేడీ పార్టీ సమావేశాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. తనను ఎన్నుకున్న ప్రజల కోసం ఏమైనా చేస్తానని బహిరంగంగా చెప్పుకుంటున్న ముదులికి, బీజేడీ ఈసారి టిక్కెట్టు కేటాయిస్తుందా అనేది అనుమానమేనని తెలుస్తోంది.



మకరంద ముదులి

కృష్ణ మహాపాత్రో అండతో...

గత సార్వత్రిక ఎన్నికల్లో ముదిలికి కాసీపూర్‌లోని బీజేడీ సీనియర్ నాయకుడు కృష్ణ మహాపాత్రో అండగా నిలిచారు. ఒకవైపు బీజేడీ పార్టీలో క్రియాశీల వ్యక్తిగా కార్యక్రమాలు నిర్వహిస్తూనే, మరోవైపు స్వతంత్ర అభ్యర్థిగా రాయగడ శాసనసభ నుంచి పోటీ చేసిన ముదలికి ఆయన పరోక్షంగా మద్దతిచ్చారు. అందుకు అవసరమైన అన్నీ సమకూర్చారు. దీంతో పాటు ముదలిపై ఉన్న అభిమానంతో ఆ ప్రాంత ప్రజల సహకారంలో గత ఎన్నికల్లో విజయం సునాయాసం అయ్యింది. అయితే తన మద్దతుతో గెలిపొందిన ముదులి కాసీపూర్ ప్రాంతాన్ని విస్మరించారని, అలాగే తాను చేసిన సహకారాన్ని మరిచారని కృష్ణ మహాపాత్రోతో పాటు ఆయన వర్గంలో గత కొన్నాళ్లుగా అసంతృప్తి ఉంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో ముదులి ఒకవేళ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా, లేదా అధికార బీజేడీ టిక్కెట్టుపై బరిలోకి దిగినా కృష్ణ మహాపాత్రో సహకారం ఎంత వరకు లభిస్తుందో చూడాలి.

రాయగడలో అసంతృప్తి వర్గం

మకరంద ముదులికి బీజేడీ పార్టీ వర్గాల మద్దతు లభిస్తున్నప్పటికీ, రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావుతో సత్సంబంధాలు అంతగా లేకపోవడంతో ఆ పార్టీ టిక్కెట్టు లభించే అవకాశాలు అంతగా కనిపించడం లేదు. రాయగడ శాసనసభ నుంచి బీజేడీ టిక్కెట్టు పొందాలంటే అందుకు నెక్కంటి అండదండలు, ఆయన సహాయ, సహకారాలు సంపూర్ణంగా ఉండాలి. అయితే అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న ముదలికి పార్టీ టిక్కెట్టు కేటాయింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉండగా బీజేడీ టిక్కెట్టు ఇచ్చినా, ఇవ్వకపోయినా తాను మాత్రం పోటీ చేయడం ఖాయమని ఒక సందర్భంలో ముదలి మీడియాతో వెల్లడించారు.

బీజేడీకి ప్రతిష్టాత్మకం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయగడ శాసనసభ స్థానాన్ని ఎలాగైనా గెలిచి తీరాలని పట్టుదలతో ఉన్న నెక్కంటి అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. గత ఎన్నికల్లో పార్టీలో నెలకొన్న విభేదాలు కారణంగా ఈ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఈసారి ఆ తప్పిదం పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రాయగడ నియోజకవర్గంలో మహా సమావేశం పేరిట కార్యకర్తల సమావేశాలను నిర్వహించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కెరడ, అదేవిధంగా జేకేపూర్‌లలో నెక్కంటి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాలకు అనూహ్యమైన స్పందన లభించింది.

కొత్తవారికి అవకాశం

ఈ స్థానం నుంచి బీజేడీ టిక్కెట్టు కొత్త వారికి కేటాయించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గం పరిధి కాసీపూర్‌కు చెందిన ఒక మహిళకు టిక్కెట్టు లభించే అవకాశం ఉందని వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మకరంద ముదులికి టిక్కెట్టు లభించే అవకాశం కనిపించడం లేదు. అలాగే నెక్కంటి సిఫార్సు చేసిన వారికి మాత్రమే అధిష్టానం టిక్కెట్టు కేటాయిస్తుంది కాబట్టి, ఆయనతో అంతగా సత్సంబంధాలు లేని ముదులికి టిక్కెట్టు లభించే అవకాశం అంతంత మాత్రంగానే ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ముదులి మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. మరి ఈ నియోజకవర్గం నుంచి అధికార బీజేడీ టిక్కెట్టుపై పోటీచేసే అవకాశం ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సిందే.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు



మన్నాట మిశ్రాకు సీఎం నవీన్ పట్నాయక్ సత్కారం



ముఖ్యమంత్రి సత్కారం అందుకున్న ప్రణతి నాయక్

భువనేశ్వర్: అంతర్జాతీయ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఒడిశాకు చెందిన ఇద్దరు మహిళా అథ్లెట్లు ప్రణతి నాయక్, మన్నాట మిశ్రాలను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం సత్కరించారు. ఒడిశా ఏఎంఎన్‌ఎస్, ఇండియా జిమ్నాస్టిక్స్ హెచ్‌పీసీలో శిక్షణ పొందుతున్న ప్రణతి నాయక్ కైరోలో జరిగిన ప్రతిష్టాత్మక ఎఫ్‌ఐజీ ప్రపంచ కప్ 2024 పోటీలో కాంస్య పతకాన్ని సాధించి రాష్ట్రానికి పేరు తెచ్చిపెట్టింది. దీంతో ఆమె విజయానికి గుర్తింపుగా ముఖ్యమంత్రి రూ.5,00,000 నగదు పురస్కారంతో సత్కరించారు. అదేవిధంగా ఒడిశా ఐఐఎస్ స్విమ్మింగ్ హెచ్‌పీసీకి చెందిన ఏస్ స్విమ్మర్ మన్నాట మిశ్రా ప్రథమ బిమ్స్‌టెక్ ఆక్వాటిక్స్ ఛాంపియన్ షిప్–2024లో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె అద్భుతమైన ప్రదర్శనకు గుర్తుగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సత్కరించారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా ఆమెకు రూ.2,00,000 నగదు బహుమతిని అందించారు. క్రీడా రంగంలో ఎదిగేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

పేదల అభ్యున్నతే సీఎం నవీన్ ధ్యేయం



మాట్లాడుతున్న వీకే పాండ్యన్



ప్రజలతో మమేకమవుతున్న పాండ్యన్



పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బరంపురం: రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతే సీఎం నవీన్ పట్నాయక్ ధ్యేయమని 5టీ చైర్మన్ వీకే పాండ్యన్ అన్నారు. నగరానికి సమీపంలోని కుకుడాఖండి బ్లాక్‌లో అమో ఒడిశా నవీన్ ఒడిశా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాండియన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వం తరపున దేశంలోనే మొట్టమొదటి సారిగా గంజాం జిల్లాలోని ఎన్‌ఏసీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని 2000 మంది బస్తీవాసులకు పట్టాలు పంపిణీ ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అలాగే జిల్లాలో 157 కళాశాలలు, పాఠశాలల అభివృద్ధి కోసం రూ.180 కోట్లు నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా తాగు, సాగునీటి పథకాల కోసం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు.

16 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం

- కాలియా యోజన పొడిగింపు
- సెమీ కండక్టర్ పాలసీ సవరణ



మంత్రి మండలి తీర్మానాలు వివరిస్తున్న మంత్రులు, సీఎస్

భువనేశ్వర్: స్థానిక లోక్‌సేవా భవన్ సమావేశ మందిరంలో సీఎం నవీన్ పట్నాయక్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం శుక్రవారం జరిగింది. దీనిలో భాగంగా 13 వివిధ శాఖలకు సంబంధించిన 16 ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. సమావేశం అనంతరం మంత్రులు రణేంద్ర ప్రతాప్ స్వంయి, సుదాం మరాండీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనాలు ఆమోదించిన ప్రతిపాదిత అంశాలను వివరించారు.

పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు

సెమీ కండక్టర్, ఎలక్ట్రానిక్ చిప్‌లు, అనుబంధ ఉత్పత్తుల కోసం యూనిట్ల ఏర్పాటులో పెట్టుబడిదారులను ఆకర్షించడానికి ఒడిశా సెమీ కండక్టర్ తయారీ విధానం – 2023 చట్ట సవరణకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సవరించిన నిబంధనల ప్రకారం పెట్టుబడిలో రూ.500 కోట్లకు మించిన మెగా ప్రాజెక్ట్‌లకు వడ్డీ రాయితీపై 7 సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ. 25 కోట్ల గరిష్ట పరిమితిని కల్పించారు. గతంలో ఈ సౌలభ్యం 5 శాతానికి మాత్రమే పరిమితం. అదనంగా అటువంటి మెగా ప్రాజెక్ట్‌లు 10 సంవత్సరాల పాటు ఏటా రూ.2 కోట్ల వరకు రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు. ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్సెంటివ్ (పీఎల్‌ఐ) విషయానికొస్తే, ఉత్పత్తి ప్రారంభించిన తర్వాత 7 సంవత్సరాల వ్యవధిలో 5 సంవత్సరాల నిరంతర కాలానికి ఇన్సెంటివ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అన్ని యూనిట్లకు సౌకర్యం కల్పించారు. కోర్ కార్యకలాపాల్లో నిమగ్నమైన వారి ఉద్యోగులకు శిక్షణ కింద స్కిల్ డెవలప్‌మెంట్ పరంగా, అర్హత కలిగిన యూనిట్లు 5 సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ. 2 కోట్ల వరకు రీయింబర్స్‌మెంట్‌ను పొందుతాయి.

ఆమోదించిన ఇతర ప్రధాన ప్రతిపాదనలు

సాగరమాల కార్యక్రమం కింద కేంద్రపడా జిల్లా తొలొచువా, భద్రక్ జిల్లాలో కనినాలిని కలుపుతూ రో–పాక్స్ జెట్టీ, అనుబంధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అభివృద్ధికి రూ.146.39 కోట్ల వ్యయ మంజూరు. నువా ఓ యువతరం సాధికారిత కోసం బడ్జెట్‌ను రూ.315 కోట్లకు సవరణ చేశారు. ఒడిశా సబ్ ఆర్డినేట్ ఫైనాన్స్ సర్వీస్ (కమర్షియల్ ట్యాక్స్ బ్రాంచ్) రిక్రూట్‌మెంట్, సర్వీస్ రూల్స్ షరతులు సవరణకు ఆమోదం తెలిపారు. అలాగే అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్, ద్రవ్య సేవా పన్ను అధికారుల భర్తీ పరీక్ష సిలబస్ సవరణ. కమిషనర్ ఆఫ్ కమర్షియల్ టాక్సెస్ అండ్ జీఎస్‌టీ వ్యవహారం ఇక నుంచి చీఫ్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ టాక్సెస్ అండ్ జీఎస్‌టీ, ఒడిశాగా కొనసాగుతుంది. రూ. 27.37 కోట్ల అదనపు వార్షిక ఆర్థిక భారంతో ఒడిశా (ప్రభుత్వేతర కళాశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత మాధ్యమిక పాఠశాలలు) పరిధిలో ఉన్న అర్హత కలిగిన ఉద్యోగుల కోసం 7వ పే కమిషన్‌కు అనుగుణంగా సవరించిన స్థాయిలో గ్రాంట్–ఇన్–ఎయిడ్ పొడిగింపు. బ్లాక్ గ్రాంట్ ఆర్డర్ రూపంలో గ్రాంట్–ఇన్–ఎయిడ్ – 2014 పొడిగింపు. ఇటీవల విడుదలైన హిందీ సినిమా ట్వెల్త్ ఫెయిల్ వినోదపు పన్ను మినహాయింపు. 1964 నుంచి కొరాపుట్ జిల్లా సునాబెడలో స్థిరపడిన తూర్పు పాకిస్తాన్, బర్మాకు చెందిన 515 స్థానభ్రంశం చెందిన కుటుంబాలకు ప్రస్తుతం ఉన్న చోటు, నిర్మాణాలపై శాశ్వత హక్కు మరియు యాజమాన్యం అధికారాలకు ఆమోదం తెలిపింది.

మూడేళ్ల పాటు పొడిగింపు

రాష్ట్ర ప్రభుత్వం కాలియా పథకాన్ని మరో 3 ఏళ్ల పాటు పొడిగించింది. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఈ పథకం విస్తరించబడింది. రాష్ట్రంలోని అత్యధిక జనాభా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతు శ్రేయస్సు మరియు వ్యవసాయ పురోగతిని వేగవంతం చేసి భూమిలేని వ్యవసాయ కుటుంబాల పేదరికాన్ని నిర్మూలించడం ఈ పథకం లక్ష్యం. రైతుల కుటుంబ భవిష్యత్తు వారి పిల్లల అభివృద్ధిపై ఆధారపడి ఉన్నందున, వివిధ విద్యాసంస్థల్లో వృత్తిపరమైన, సాంకేతిక విద్యను పొందేందుకు కాలియా లబ్ధిదారుల పిల్లలకు స్కాలర్‌షిప్‌ను అమలు చేసింది. బలహీన, సన్నకారు రైతులు, భూమిలేని వ్యవసాయ కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సహిస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో ఏప్రిల్ 15, రబీ సీజన్ కోసం సెప్టెంబర్ 1 నుంచి కాలియా సహాయం విడుదల చేస్తారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం



అరెస్టైన దుర్గా ప్రసాద్ పండా

జయపురం: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన పోలీసు కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 2021వ సంవత్సరంలో కానిస్టేబుల్ రీణా పాటక్ సోదరుడు ఎక్సైజ్ విభాగంలో ఎస్‌ఐ పదవికి దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూకి వెళ్లాడు. అయితే తన సోదరుడికి ఆ ఉద్యోగం వచ్చేలా చూడాలని రీణా పాటక్ జయపురం కొత్త వీధి నాల్గో లైన్‌లో నివాసముంటున్న ఐఆర్‌బీఎన్ కానిస్టేబుల్ దుర్గా ప్రసాద్ పండాను కోరింది. ఉద్యోగం వచ్చేలా చేస్తానని, అయితే అందుకు రూ.7 లక్షలు లంచం ఇవ్వాల్సి ఉంటుందని అతడు తెలిపాడు. దీంతో ఆమె ముందుగా పండాకు రూ.3 లక్షలు అందజేసింది. తన సోదరుడికి ఉద్యోగం వచ్చిన వెంటనే మిగతా డబ్బు ఇస్తానని తెలిపింది. అయితే మూడేళ్లు గడచినా తన సోదరుడికి ఉద్యోగం ఇప్పించలేదు సరికదా ఇచ్చిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో రీణా ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు నిర్వహించి దుర్గా ప్రసాద్ పండాను అరెస్టు చేశారు.

ఇద్దరు నిందితులు అరెస్టు



అజయ్ బాగ్



డేవిడ్ ఖొర



సీజ్ చేసిన కారు, బైక్



సీజ్ చేసిన తుపాకీ, సెల్‌ఫోన్లు

జయపురం: స్థానిక బరిణిపుట్ పంచాయతీ ఓసీసీ కాలనీలో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి శుక్రవారం వెల్లడించారు. అరెస్టైనవారు బరిణిపుట్‌కు చెందిన అజయ బాగ్(22), దసమంతపూర్‌కు చెందిన డేవిడ్ ఖొర(21)లుగా నిర్ధారించారు. వారి దగ్గర నుంచి ఒక కారు, ఒక బైక్, ఒక పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18వ తేదీన ఓసీసీ కాలనీలోని రంజిత్ హరిజన్ ఇంట్లోకి దుండగులు ప్రవేశించారు. ఇంట్లోని డబ్బు, బంగారం ఇవ్వకపోతే చంపుతామని భయపెట్టారు. అల్మరాలో రూ.50 వేలు, 5 తులాల బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్పీ సోనేకర్, ఎస్డీపీవో శుభేందు శబర, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి, బరిణిపుట్ పోలీసు పంటి అధికారి కామాక్ష ప్రసాద్ బిశాయ్ సంఘటన స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించారు. దొంగలు దొంగతనం చేసిన వెంటనే రాష్ట్రం దాటి వెళ్లిపోయారు. దీంతో వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. అనంతరం ఈనెల 21వ తేదీన అజయ్ బాగ్, డేవిడ్ ఖొరలను అరెస్టు చేశారు. ఈ ఇద్దరుపై వివిధ పోలీసుస్టేషన్లలో పలు కేసులు ఉన్నాయని వెల్లడించారు.

క్లుప్తంగా

కాశీనగర్ స్టేడియం ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్‌లో నిర్మించిన బహుళ ప్రయోజన ఇండోర్ స్టేడియంను సీఎం నవీన్ పట్నాయక్ వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గజపతి కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, ఎన్‌డీసీ చైర్మన్ మరియాం రైతో, ఎన్ఏసీ చైర్మన్ రఘురాం సాహు తదితరులు పాల్గొన్నారు.

నృసింహ స్వామి రాతి విగ్రహం చోరీ


బాబా కపాల మోచన ఆలయం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని ఆలయం పశ్చిమ ద్వారం ఆవరణలోని బాబా కపాల మోచన ఆలయంలో దుండగులు గురువారం అర్ధరాత్రి విలువైన విగ్రహాన్ని దొంగిలించారు. ఆలయ ప్రధాన ద్వారం తాళాన్ని పగులగొట్టి చొరబడినట్లు భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో పోలీసులు ఉన్నప్పటికీ ఆగంతకులు అమూల్యమైన ప్రాచీన రాతి విగ్రహం దొంగిలించడంపై సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది. ఆలయ అర్చకులు శుక్రవారం ఉదయం పూజలు నిర్వహించేందుకు తలుపులు తెరవబోతే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ దొంగతనంపై అర్చకులు సింహద్వార్ పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. చాలా కాలం క్రితం ఈ ఆలయంలో ప్రతిష్ఠించబడిన అత్యంత పురాతన నృసింహ స్వామి రాతి విగ్రహం దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది చాలా విలువైనదని అర్చకులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించాలని దుండగులు లక్ష్యంగా చేసుకుని ఉండవచ్చని సందేహం వ్యక్తం చేశారు.

శ్రీశైలం మల్లన్న తలపాగా వస్త్రాల ఊరేగింపు


తలపాగా వస్త్రాలను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు

పొందూరు: శ్రీశైలంలో కొలువైన భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి మహాశివరాత్రి పర్వదినాన సమర్పించేందుకు స్థానిక చేనేత వాడలో తయారు చేసిన తలపాగా వస్త్రాలను శుక్రవారం తిరువీధి నిర్వహించారు. అపారమైన భక్తి శ్రద్ధలతో స్వామిని కొలుస్తూ, ఉపవాస దీక్షలు చేస్తూ తలపాగా, వస్త్రాలను నేశారు. తిరువీధి అనంతరం వస్త్రాలను తయారు చేసిన అంకం ప్రసాద్ ఇంటికి చేర్చారు. తలపాగా వస్త్రాలకు భజనలు చేశారు. కార్యక్రమంలో చేనేత కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సినీ నటుడు ప్రభాస్ శ్రీను


ఆదిత్యుని సన్నిధిలో ప్రభాస్ శ్రీను తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సినీ నటుడు ప్రభాస్ శ్రీను శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికార సిబ్బంది ఆయనకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నానని, త్వరలో దర్శకుడు మారుతి ప్రభాస్ కాంబోలో చిత్రం విడుదలకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, బీఎస్ చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

26న అమృత్ భారత్ రైల్వేస్టేషన్లకు శంకుస్థాపన

- ఖుర్దా రోడ్ రైల్వే మండలంలో 6 స్టేషన్లు

భువనేశ్వర్: దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరిచేందుకు రైల్వే శాఖ అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తోంది. దీనిలో భాగంగా రూ.41,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 26న జాతికి అంకితం చేయనున్నారు. ఖుర్దా రోడ్ రైల్వే మండలంలో రూ.1,311.32 కోట్ల విలువైన 25 రైలు ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ హెచ్.ఎస్.బాజ్వా తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఖుర్దారోడ్ డివిజన్ పరిధిలో 6 రైల్వే స్టేషన్లు, 16 లెవెల్ క్రాసింగ్ (ఎల్‌సి) గేట్ల వద్ద మరో రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల అభివృద్ధికి ప్రధాని శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. 3 లెవెల్ క్రాసింగ్ గేట్‌ల వద్ద నిర్మించిన రోడ్ ఓవర్ బ్రిడ్జి, అండర్‌పాస్ సౌకర్యాలను ప్రజలకు అంకితం చేస్తారన్నారు. ఖుర్దారోడ్ మండలంలో 6 రైల్వే స్టేషన్లు భద్రక్, తాల్చేర్, పారాదీప్, రఘునాథ్‌పూర్, కెంజొహర్‌గొడా, ఇచ్ఛాపురంలు ఉన్నాయి. ఈ స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సువిశాల స్టేషన్ ఆవరణ, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, వెయిటింగ్ హాల్స్, టాయిలెట్లు, లిఫ్ట్, ఎస్కలేటర్లు, ఉచిత వైఫై, వన్ స్టేషన్ వన్ ప్రోడక్ట్ స్టాల్స్, మెరుగైన ప్రయాణికుల సమాచార వ్యవస్థలు వంటి సౌకర్యాలతో అభివృద్ధి చేస్తారు. ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, వ్యాపార సమావేశాల కోసం ప్రత్యేక ప్రాంగణాలు, ల్యాండ్ స్కేపింగ్ మొదలైన అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.


వివరాలు వెల్లడిస్తున్న డీఆర్ఎం బాజ్వా

తొలి విడత పనులు వేగవంతం

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఖుర్దా రోడ్ డివిజన్‌లో 23 రైల్వే స్టేషన్లను గుర్తించారు. వీటిలో తొలి విడత కింద 14 రైల్వే స్టేషన్లను ఎంపిక చేశారు. ఈ స్టేషన్లలో పనులు వేగవంతంగా సాగుతున్నాయని స్థానిక సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అమితేష్ ఆనంద్ తెలిపారు. ఈ జాబితాలో భువనేశ్వర్, పూరీ, కటక్, సాక్షిగోపాల్, మంచేశ్వర్, ఢెంకనాల్, ఛత్రపూర్, అంగుల్, పలాస, మెరామండలి, బలుగాంవ్, లింగరాజ్ టెంపుల్ రోడ్, తాల్చేర్ రోడ్, ఖుర్దా రోడ్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఖుర్దా రోడ్ – కైపదర్, కటక్ – బారంగ్, రంభ – హుమ్మా, రాజీతల్ – భద్రక్, జాజ్‌పూర్ – జఖ్‌పురా తదితర సెక్షన్లలో 16 ఎల్‌సీ గేట్ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు వివిధ ప్రదేశాల్లో స్థానికుల దీర్ఘకాలిక డిమాండ్లు నెరవేరనున్నాయి అన్నారు. 3 లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద నిర్మించిన అండర్‌పాస్, ఆర్‌వోబీలు ప్రజలకు అంకితమైనట్లు తెలిపారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగుతాయని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో అదనపు మండల రైల్వే అధికారి (ఆపరేషన్) శుభ్ర జ్యోతి మండల్, అదనపు మండల రైల్వే అధికారి (ఇన్‌ఫ్రా) కల్యాణ్ పట్నాయక్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అమితేష్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ

ఈస్ట్‌కోస్ట్ జోన్‌లో 22 రైల్వేస్టేషన్లు

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లో కొత్తగా 22 అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల నిర్మాణానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేస్తారని జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ తెలిపారు. మంజూరైన రూ.790 కోట్లు వెచ్చించి ఈ స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ చొరవ కింద స్టేషన్ సౌకర్యాలను మెరుగుపరిచి ప్రయాణికులకు ప్రయాణం మరింత సౌకర్యవంతం చేయనున్నట్లు వివరించారు. కొత్త అమృత్ భారత్ స్టేషన్ల జాబితాలో నౌపడ, సింహాచలం, బొబ్బిలి, శ్రీకాకుళం రోడ్, పార్వతీపురం, చీపురుపల్లి, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగుడ రోడ్, టిట్లాగఢ్, కెసింగ, రాయగడ, పర్లాకిమిడి, కొరాపుట్, జయపురం, తాల్చేర్, రఘునాథ్‌పూర్, పారాదీప్, కెందుఝొరా గొడా, భద్రక్, అరకు, కొత్తవలస, ఇచ్ఛాపురం ఉన్నట్లు పేర్కొన్నారు.

క్రీడా హబ్‌గా రాష్ట్రానికి గుర్తింపు

- సీఎం నవీన్ పట్నాయక్


వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

రాయగడ: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒడిశా రాష్ట్రం క్రీడా హబ్‌గా గుర్తింపు పొందుతోందని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.660 కోట్లతో నిర్మించిన బహుళ ప్రయోజన ఇండోర్ స్టేడియాలు, నిర్మాణం కానున్న హాకీ, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి శిక్షణ కేంద్రాలకు వర్చువల్ మాధ్యమంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా రంగంలో రాష్ట్రం మరో మైలురాయిని చేరుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో 5టీ చైర్మన్ వీకే పాండ్యన్, రాష్ట్ర క్రీడా శాఖమంత్రి తుషార్ కాంతి బెహర, ఐటీ శాఖ మంత్రి అశోక్ కుమార్ పండ తదితరులు పాల్గొన్నారు.


రాయగడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సరక, ముదులి తదితరులు


అంబాగుడలో నిర్మితమైన ఇండోర్ స్టేడియం


గుణుపూర్‌లోని ఇండోర్ స్టేడియం

రాయగడలో...

వర్చువల్ మాధ్యమంలో రాయగడలోని అంబాగుడలో సుమారు రూ.9.86 కోట్లతో నిర్మించిన బహుళ ప్రయోజన ఇండోర్ స్టేడియం, జిల్లాలోని గుణుపూర్‌లో రూ.9.67 కోట్లతో, గుడరిలో సుమారు రూ.62 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి, తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, బీడీవో అమూల్య కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను సదరు పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో స్థానిక బ్యాంక్ కాలనీకి చెందిన దేవాశిష్ బెహర, మహ్మద్ ముస్తాపలు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి చోరీకి గురైన ల్యాప్‌టాప్, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సదరు పోలీసుస్టేషన్ ఐఐసీ కమలాకాంత్ కుహరో తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సునీల్ కుమార్ మహంత్ అనే వ్యక్తి పాత ఎల్ఐసీ కాలనీలోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. అయితే పనిరీత్యా అతను ఇంటికి తాళం వేసి భువనేశ్వర్ వెళ్లారు. తిరిగి ఈనెల 12వ తేదీన ఇంటికి వచ్చిచూడగా తలుపులు తెరిచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఇంట్లో రూ.50 వేల నగదుతో పాటు ల్యాప్‌టాప్, ట్యాబ్ చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. అయితే నిందితులు డబ్బులు నగదును ఖర్చు చేయడంతో ల్యాప్‌టాప్, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం వారిని కోర్టుకు తరలించారు.


చోరీ కేసులో అరెస్టైన నిందితులు

జవాన్లు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు


మావో శిబిరంలో స్వాధీనం చేసుకున్న సామగ్రి

భువనేశ్వర్: ఛత్తీస్‌గఢ్‌కు సమీపంలోని పశ్చిమ ఒడిశా బర్‌గఢ్ జిల్లా పాయికమల్ ప్రాంతం అడవిలో స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్‌వోజీ), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) సిబ్బంది శుక్రవారం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. గంధమర్దన్ కొండపై మావోయిస్టుల గుంపు ఉన్నట్లు సమాచారం అందడంతో చర్యలు తీసుకున్నారు. ఉదయం ఖండిఝురానుందర్ గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో పోలీసులను గుర్తించిన మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల పోరు కొంత సమయం పాటు కొనసాగింది. అనంతరం ఎస్‌వోజీ జవాన్లు మావోయిస్టుల శిబిరాన్ని ఛేదించారు. కాల్పుల అనంతరం భద్రతా సిబ్బంది ఆ ప్రాంతంలో సోదాలు చేయగా ఐఈడీ, 8 బ్యాగులు, క్యాంప్ ఆర్టికల్స్, దుస్తులు, ఆహార పదార్థాలు లభించాయి. కాల్పుల నేపథ్యంలో సీనియర్ పోలీసు అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఏడీజీ (ఆపరేషన్స్), డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. బర్‌గఢ్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రహ్లాద్ సహాయ్ మీనా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

కాసీపూర్ అభివృద్ధే ధ్యేయం


కాంగ్రెస్ నాయకులకు నీరాజనాలు పలుకుతున్న మహిళలు

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక

రాయగడ: కాసీపూర్ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక అన్నారు. కాసీపూర్ సమితి డొంగాశిలిలో కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి, ఖనిజ సంపద కలిగిన కాశీపూర్‌లో అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని బీజేడీ నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, నాయకుడు అప్పలస్వామి కద్రక తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి ఉలక

నేడు గజోద్ధారణ దర్శనం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుడు భక్తులకు గజోద్ధారణ అలంకరణలో శనివారం దర్శనం ఇవ్వనున్నాడు. ఈ అలంకరణ పనులు చకచకా సాగుతున్నాయి. ఏటా పవిత్ర మాఘ పూర్ణిమ పురస్కరించుకుని శ్రీమందిరం రత్న వేదికపై మూలవిరాటులు ఈ అలంకరణలో శోభిల్లడం విశేషం. మాఘ పూర్ణిమ మధ్యాహ్నం ధూపదీపారాధన అనంతరం ఆలయంలోని రత్న సింహాసనంపై స్వామివారి అరుదైన దర్శనం లభిస్తుంది. సాయంత్రం ధూపదీపారాధన సందర్భంగా పాయసం నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సరస్సులో స్నానం చేస్తున్న గజరాజు మొసలి దాడికి గురై ప్రాణాపాయ స్థితిలో చిక్కుకుని శ్రీమహా విష్ణువును వేడుకోవడంతో బతికి బయటపడింది. ఈ పౌరాణిక ఇతివృత్తం ప్రతీకగా ఈ అలంకరణ చేస్తున్నట్లు సమాచారం. ఈ అలంకరణలో శ్రీజగన్నాథుడు చతుర్భుజిగా శంఖ, చక్ర, గద, పద్మాలను పట్టుకుని ఉంటాడు. తన ఒడిలో లక్ష్మీ విగ్రహాన్ని పట్టుకుని గరుడిపై కూర్చున్నట్లు కనిపిస్తారు. స్వామికి ఇరువైపులా పద్మపూలని తొండంతో చుట్టుకున్న రెండు ఏనుగు బొమ్మల్ని అమర్చుతారు. అలంకరణ పనులు స్థానిక శ్రీమందిరం నీలాద్రి మ్యూజియంలో నిర్వహిస్తున్నారు. దయానామాలి సేవకుడు బసంత్ కుమార్ రాణా పర్యవేక్షణలో ఒక టైలర్, పెయింటర్‌తో సహా 5 మంది కళాకారులు అలంకరణ సరంజామా పనిలో నిమగ్నమై ఉన్నారు. జీలుగు, జరీ, వస్త్రాలతో అలంకరణ సామగ్రి సిద్ధమవుతోంది.

25 మంది వ్యాపారులపై కేసులు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని రేషన్ షాపుల డీలర్లు వినియోగిస్తున్న 51 తూనిక యంత్రాలను స్థానిక ఎంఎల్ఎస్ కేంద్రంలో పలాస తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కె.రాజారమేష్ శుక్రవారం తనిఖీ చేసి సీలు వేశారు. అలాగే కోటబొమ్మాళి, కొత్తపేట ప్రాంతాల్లో కిరాణా, ఎరువులు, పండ్లు, కూరగాయాలు, కూల్‌డ్రింక్స్, ఎలక్ట్రికల్ దుకాణాలు, ఇతర వ్యాపార కేంద్రాలనూ పరిశీలించారు. ఎంఆర్‌పీ, బరువు వ్యత్యాసాలు గుర్తించిన 25 మంది యజమానులపై కేసులు నమోదు చేశారు. ఎక్కడైనా తూనికల్లో వ్యత్యాసాలు కనిపిస్తే 9398124319 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వత్సవలస పిలుస్తోంది

- నేటి నుంచి వత్సవలస జాతర
- ఐదు వారాల పాటు రాజమ్మ తల్లి పండగ

గార: వత్సవలస గ్రామ దేవత శ్రీరాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) జాతర శనివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా రాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) అమ్మవారిని కొలుస్తున్న భక్తులు తమ తొలి సంతానాన్ని ఇక్కడికి తీసుకువచ్చి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకుంటారు. తెలంగాణతో పాటు ఉత్తరాంధ్ర నుంచి వేలాది కుటుంబాలు తమ ఇంటి దేవతగా రాజమ్మతల్లిని కొలుస్తుంటాయి. తమ ఇంటిదేవత కావడంతో మాఘమాసంలో ఆదిపీఠమైన వత్సవలస వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఇంట్లో పుట్టిన వంశోద్ధారకుల తల వెంట్రుక (పుట్టుకొప్పు)లను ఇక్కడ అమ్మవారికి సమర్పిస్తుంటారు. శనివారం సాయంత్రం ఇక్కడకు విచ్చేసి ఆదివారం ఉదయం అమ్మవారికి మొక్కులు తీర్చుకొని తన వెంట తీసుకువచ్చిన కోళ్లు, గొర్రెలను సమర్పిస్తుంటారు. అనంతరం ఇక్కడే వంటలు చేసుకొని విందు ఆరగించి తిరిగి ఇంటిముఖం పట్టడంతో జాతర ముగుస్తుంది.

ఐదు వారాల పాటు..

గ్రామంలో సుమారు 25 పీఠాలుండగా, ప్రధానంగా ఐదు ప్రధాన పీఠాల వద్ద సంబరాలు జరుగుతుంటాయి. ఈ మాఘమాసంలో ఐదు వారాలు జాతర జరుగుతుండగా, వారానికి ఒక కుటుంబం వద్ద ఉన్న రాజమ్మతల్లి వద్ద పూజలు జరుగుతున్నా.. అన్ని పీఠాల వద్దకు భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారు. తొలి వారం మైలపల్లి శ్రీనివాస్‌దాసు పీఠంలో జరగనుంది.

150 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు..

యాత్రకు తొలివారం 150 మందితో పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు తెలిపా రు. ఐదు వారాల పాటు వరుసగా శని, ఆది వారాల్లో శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలను శ్రీకూర్మం కూడలి మీదుగా తూలుగు నుంచి వత్సవలస వరకు వన్‌వే ను ఏర్పాటు చేశామని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ప్రకటించారు. తిరుగు ప్రయాణంలో శ్రీకూర్మం మీదుగా శ్రీకాకుళం వెళ్లేందుకు వన్‌వే ఉంటుందని తెలిపారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం



ఐదు వారాల పాటు ఈ ఏడాది యాత్ర జరగనుంది. తొలివారం మా పీఠంలో యాత్ర ప్రారంభమవుతుంది. మొక్కులు తీర్చుకునే భక్తులు కుటుంబ సమేతంగా ముందురోజు రాత్రి విచ్చేసి ఇక్కడే బస చేస్తారు. తాగునీరు, విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం.

– మైలపల్లి శ్రీనివాసదాసు, రాజమ్మతల్లి దాసుడు, వత్సవలస


ఆదిపీఠంలో ఈ వారం పూజలందుకోనున్న రాజరాజేశ్వరి దేవి

క్లుప్తంగా

సాంకేతిక సహాయకురాలు సస్పెన్షన్

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకురాలు ఎస్.పద్మావతిని సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆదేశాలు జారీ చేసినట్టు ఏపీఓ ఎం.గౌరీనాథ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని మరుపెంట, కొంకడివరం, చినగుడబ, సంతోషపురం పంచాయతీలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఈమె విధులలో నిర్లక్ష్యం వహించడంతో పాటు, పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోవడం, వేతనదారులకు పనులు కల్పించకపోవడం, పనులలో ముందస్తుగా కొలతలు ఇవ్వకపోవడం తదితర కారణాలతో విధులను తొలగించడం జరిగిందన్నారు. ఉపాధి సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

యువకుడి ఆత్మహత్య

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో వలస కూలీగా వచ్చిన మింది వీరబాబు (22) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా వున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవమ్మంగి మండలం భూసరపాడు గ్రామానికి చెందిన మింది వీరబాబు (22) విజయనగరం జిల్లా వేపాడ మండలం బొద్దాం గ్రామంలో వలస కూలీగా గత నాలుగేళ్లుగా వచ్చి పని చేస్తున్నాడు. అప్పుల బాధ తాళలేక శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందడంతో ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

పాచిపెంట: మండల కేంద్రంలోని ఎరుకుల వీధిలో భార్యపై భర్త హత్యాయత్నం చేశాడు. దీనిపై ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలు.. ఎరుకుల వీధికి చెందిన దాసరిసోములు, భార్య అసిరమ్మలకు వివాహమై సుమారు 20 సంవత్సరాలైంది. ఇటీవల కొన్ని నెలలు క్రితం వారు విడిపోయి ఎవరికి వారే మండల కేంద్రంలో జీవనం సాగిస్తున్నారు. అసిరమ్మకు జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైన నేపథ్యంలో తన ఆధార్ కార్డు కోసం సోములు వద్దకు శుక్రవారం అసిరమ్మ వచ్చింది. ఈ క్రమంలో అసిరమ్మ, సోములు మధ్య వాగ్వాదం జరగ్గా అసిరమ్మ కడుపులో సాములు కత్తితో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమైన అసిరమ్మను వెంటనే స్థానికులు పాచిపెంట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ట్యాబ్‌ల వినియోగం తప్పనిసరి

- డీఈఓ ప్రేమకుమార్

చీపురుపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8,9 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను తప్పనిసరిగా వినియోగించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమకుమార్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ట్యాబ్‌ల వినియోగం, జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం మండలంలోని విజయరాంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ ఎం.బూసినాయుడు, బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జె.రామునాయుడు, డీసీఈ బోర్డు సెక్రటరీ సన్యాసిరాజు, సీఆర్పీ కంది రామకృష్ణ ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల ఏర్పాటుకు జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్సు ద్వారా శుక్రవారం సమీక్షించారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను రెండు రోజులలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బంది నియమాకం, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణా నియంత్రణ, పత్రికలలో వచ్చిన వార్తలు, తదితర అంశాలపై తీసుకొంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు కె.హేమలత, వివి.రమణ తదితరులు పాల్గొన్నారు.

యువ శాస్త్రవేత్తలకు అవకాశం



కంచరాం పాఠశాలలో ప్రయోగం చేస్తున్న విద్యార్థులు

- 9వ తరగతి విద్యార్థులు అర్హులు
- ఇస్రో ఆధ్వర్యంలో దరఖాస్తుల ఆహ్వానం
- మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం

రాజాం సిటీ: యువ శాస్త్రవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కృషి చేస్తుంది. ఇందులో భాగంగా యువికా–2024 (యువ విజ్ఞాన కార్యక్రమం) యువ శాస్త్రవేత్తలను తయారుచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 9వ తరగతి చదివే విద్యార్థుల నుంచి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. రాబోయే తరాల్లో శాస్త్రవేత్తలను గుర్తించే దిశగా ఇస్రో దృష్టి సారించింది. ఇందుకు దేశ వ్యాప్తంగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తుంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్‌ఓ.జీఓవీ.ఐఎన్‌లలో దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 20 నుంచి మార్చి 20 వరకు అవకాశం కల్పించింది. అర్హులను ఎంపిక చేసి మొదటి జాబితా మార్చి 28న, రెండవ జాబితా ఏప్రిల్ 4న ఆన్‌లైన్‌లోనే ప్రకటించనుంది.

దరఖాస్తు చేయండిలా..

విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ప్రతి దశలో జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలి. అసంపూర్తి దరఖాస్తులు తిరస్కరిస్తారు.

యువికా–2024 కోసం ఏర్పాటు చేసిన డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్‌ఓ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో విద్యార్థులు సొంత ఈ–మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. క్విజ్ సూచనలు చదవడం, ఈ–మెయిల్ 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. క్విజ్ అప్‌లోడ్ చేసిన 60 నిమిషాల తరువాత యువికా పోర్టల్‌లోని ఆన్‌లైన్ దరఖాస్తులో పూర్తి వివరాలు నమోదు చేయాలి. అనంతరం డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు విద్యార్థి సంతకం చేసిన ప్రతిని, విద్యార్థి మూడేళ్లలో వివిధ అంశాల్లో రూపొందించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి. ఇందులో ఎంపికైన వారిని ఇస్రో వడబోసి తుది జాబితా అదే నెల 20న వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

అర్హులు వీరే....

ఈ ఏడాది మార్చి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. వీరు ఎనిమిదో తరగతిలో వచ్చిన మార్కులతో పాటు గత మూడు సంవత్సరాల్లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని ఉండాలి. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్‌లలో సభ్యుడై ఉండాలి. ప్రతి రాష్ట్రం నుంచి విద్యార్థుల భాగస్వామ్యం ఎంత నిష్పత్తిలో ఉండాలో నిర్ధారిస్తారు. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కావడంతో పాటు మార్చి 20 చివరి తేదీగా నిర్ణయించారు.



యువికా-2024 లోగో

మంచి అవకాశం



యువ శాస్త్రవేత్తలకు ఇస్రో మంచి అవకాశం కల్పించింది. ఈ కార్యక్రమానికి 9వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఆసక్తి గల విద్యార్థులు మార్చి 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేసుకున్న వారికి క్విజ్ రూపంలో పలు ప్రశ్నలు ఉంటాయి. ఇంతటి మంచి అవకాశాన్ని ఆసక్తి ఉన్న 9వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– పందూరు వేణుగోపాల్,
భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్,
కంచరాం, రాజాం

రాష్ట్రానికి ముగ్గురు చొప్పున అవకాశం

ఎంపికైన విద్యార్థులకు విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ (తిరువనంతపురం), యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ (బెంగళూరు), స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (అహ్మదాబాద్), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (హైదరాబాద్), నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (షిల్లాంగ్), ఐఐఆర్ఎస్ (డెహ్రాడూన్), శ్రీహరికోట అంతరిక్ష కేంద్రాలలో మే 16 నుంచి 28 వరకు 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

ఆశ్రమపాఠశాలను సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్



ఎర్రసామంతవలసలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి.శంకర్రావు

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలను ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకర్రావు శుక్రవారం సందర్శించారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి అశోక్ మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న వసతి సౌకర్యాలు, భోజనం, విద్యాబోధన తదితర అంశాలపై ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థుల చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి అశోక్ మృతి చెందడం, బాధాకరమని, ముస్ముందు ఇటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు ఆరోగ్య పరిస్థితిని ఉపాధ్యాయులు తెలుసుకోవాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తరుచూ ఆశ్రమ పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. వసతిగృహ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాల సందర్శనలో సహాయ గిరిజన సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెడదాం



సమావేశంలో మాట్లాడుతున్న పీవీఆర్

- 25న పూసపాటిరేగలో భారీ బహిరంగ సభ
- ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షుడు పీవీఆర్

విజయనగరం టౌన్: తెలగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే సమయం ఆసన్నమైందని, తెలగ కులంలో పుట్టిన ప్రతి బిడ్డకోసం బీసీ రిజర్వేషన్ సాధించేందుకు చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాలుపంచుకోవాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు (పీవీఆర్) పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ సాధించేందుకు ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకూ సుమారు 665 కిలోమీటర్లు నిర్వహించిన ఉత్తరాంధ్ర పాదయాత్రలో ప్రతి తెలగ కులస్తుడు తన అభిమానాన్ని చాటుకున్నారన్నారు. దారి పొడవునా తనకు ధైర్యాన్ని కల్పించారన్నారు. పాదయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామన్నారు. ఉత్తరాంధ్ర తెలగ గర్జన, తెలగ జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఈ నెల 25న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. తెలగ జాతిలో పుట్టిన ప్రతి బిడ్డ సభకు హాజరై, తమ ఉనికిని చాటిచెప్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే రిజర్వేషన్ ప్రక్రియను తన మేనిఫెస్టోలో చేర్చి సక్రమంగా అమలుచేస్తుందో ఆ పార్టీకి పూర్తి మద్దతు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా చలో పూసపాటిరేగ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పెద్ది లక్ష్మీనారాయణమూర్తి, కోలా నారాయణ అప్పారావు, మొంగం శ్రీనివాసరావు, సుంకర సూర్యనారాయణ, ఎర్నాగుల చక్రవర్తి, మాతా గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్షలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న డీఆర్ఓ ఎస్.డి.అనిత

- 80 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 26,452 మంది అభ్యర్థులు
- డీఆర్వో ఎస్.డి.అనిత

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 25న జరగనున్న గ్రూప్–2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత తెలిపారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు జరుగుతుందని, జిల్లాలోని 80 కేంద్రాల్లో 26,452 మంది పరీక్ష రాయనున్నట్టు వెల్లడించారు. 80 కేంద్రాలకు 24 రూట్లుగా విభజించి 24 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించామని చెప్పారు. వీరితో పాటు లైజన్ అధికారులుగా తహసీల్దార్లను నియమించామన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో రూట్, లైజన్ ఆఫీసర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రశ్నపత్రాలు తీసుకున్న దగ్గర నుంచి పరీక్ష అనంతరం ఆన్సర్ పేపర్లను సబ్‌మిట్ చేసే వరకూ చీఫ్ సూపరింటెండెంట్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటల తర్వాత మెయిన్ గేట్లను మూసివేయాలని, పరీక్ష పూర్తయిన తర్వాత 1 గంటకు అభ్యర్థులను బయటకు విడిచిపెట్టాలని సూచించారు. దివ్యాంగులు, గర్భిణులకు వీలున్నంతవరకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీపీఎస్సీ సభ్యుడు శంకర్‌రెడ్డి మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా 899 పోస్టుల కోసం 4,83,525 మంది అభ్యర్థులు గ్రూప్ 2 స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటరావు, ఇతర సిబ్బంది, పలు కళాశాలల, పాఠశాలల యాజమాన్యాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు సూచనలు

- హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- పరీక్ష హాల్‌కు సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్, మరే విధమైన ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు.
- దివ్యాంగత్వం 40 శాతం పైబడిన వారు స్క్రైబ్‌ను స్వయంగా తీసుకురావచ్చు. అభ్యర్థి విద్యార్హత కంటే తక్కువగా ఉండాలి.

108లో ప్రసవం



108లో ప్రసవించిన గిరిజన మహిళ

సీతంపేట: మండలంలోని జొన్నోడు చీపురుగూడ గ్రామానికి చెందిన సవర లావణ్య అనే గిరిజన మహిళ 108లో గురువారం అర్ధరాత్రి ప్రసవించింది. పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వెంటనే ఈఎంటీ లిమ్మక రాములు, పైలెట్ శంకరరావు గ్రామానికి వెళ్లి అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా మార్గమధ్యానికి వచ్చేసరికి పురిటి నొప్పులు ఎక్కువై ఉమ్మనీరు లీకైంది. సిబ్బంది చాకచక్యంగా ప్రసవం చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారు.

25న సబ్ జూనియర్స్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 25న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్ శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 2010 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 31వ తేదీ మధ్య జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు విధిగా తమ ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు విశాఖ వేదికగా జరిగే 3వ సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 9908353698 నంబరును సంప్రదించాలని సూచించారు.

సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అంతర్ జిల్లాల సీనియర్స్ పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 25న నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రంగారావుదొర, కార్యదర్శి కెవి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని సిటీ క్లబ్ ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 85 కేజీలలోపు బరువు కలిగి ఉండాలని, క్రీడాకారులు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు జిల్లా జట్లు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్, జూనియర్స్ సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాల, బాలికల జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయగా.. శుక్రవారం క్రీడాకారులు పయనమయ్యారు. జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈ నెల 24, 25 తేదీల్లో నెల్లూరు జిల్లా ముత్తుకూర్‌లో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనున్నారు. ఈ మేరకు క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా అసోసియేషన్ కార్యదర్శి వై.రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.భవాని తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

సెంచూరియన్ ప్రొఫెసర్‌కు గుణశేఖరన్ అవార్డు



ప్రొఫెసర్ విజయ్ బాబును అభినందిస్తున్న వీసీ మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో అప్టామెట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ విజయ్‌బాబుకు తమిళనాడులోని ప్రతిష్టాత్మక శాస్త్రవేత్త మధు మునైవార్ సేతు గుణశేఖరన్ అవార్డు లభించింది. దీనిపై వర్సిటీ వీసీ ప్రశాంతకుమార్ మహంతి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల తమిళనాడులో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా విజయ్‌బాబు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీతో పాటు యూనివర్సిటీ అధ్యాపకులు శుక్రవారం ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. పరిశోధన, విస్తరణ రంగాల్లో అద్భుతాలు సృష్టించి మరిన్ని అవార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు సిరిపురం విద్యార్థి

సంతకవిటి: నేటి నుంచి సోమవారం వరకు తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోటలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాలికల ఖో–ఖో పోటీలకు సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బూరాడ రేష్మ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు వి.వెంకటరమణ, పీడీ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. రేష్మను పలువురు అభినందించారు.



రేష్మను అభినందిస్తున్న హెచ్‌ఎం వి.వెంకటరమణ, ఉపాధ్యాయులు

మిలాన్‌లో మెరిసిన సైనిక పాఠశాల విద్యార్థులు

విజయనగరం రూరల్: విశాఖ వేదికగా జరుగుతున్న మిలాన్- 2024 ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌లో కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు మెరిశారు. ఆఖరి రోజు నిర్వహించిన పరేడ్‌లో ఎనిమిదో తరగతికి చెందిన 72 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. వీరిలో 36 మంది క్యాడెట్‌లు మార్చింగ్ కంటింజెంట్‌లో భాగం కాగా, 6 మంది బాలికలతో సహా 36 మంది క్యాడెట్లు పాఠశాల బ్యాండ్‌లో భాగమయ్యారని సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్.శాస్త్రి తెలిపారు.



మిలాన్- 2024లో భాగమైన కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు

1.50 లక్షల టిడ్కో ఇళ్లు పంపిణీ చేస్తాం

పార్వతీపురంటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా వచ్చేనెలాఖరులోగా లక్షా 50వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. పార్వతీపురంలోని టిడ్కో గృహాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఒక్క రూపాయికే పేదల సొంతింటి కల ను నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో నిర్మాణదశలో ఉన్న 768 టిడ్కో గృహాలను కొద్దిరోజుల్లో లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. ఇక్క డి కాలనీకి నిరంతరం నీటి సరఫరాకు వీలుగా రూ.12 కోట్ల వ్యయంతో పైప్‌లైన్లు వేస్తున్నామ న్నారు. కార్యక్రమంలో టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జ్యోతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

- తండ్రి, సవతి తల్లిని హత్యచేసిన కొడుకు
- అనాథగా మారిన చిన్నారి
- బొండపల్లిలో విషాదం



హత్యకు పాల్పడిన నిందితుడు లక్ష్మణరావు



హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బొండపల్లి: కుటుంబ కలహాలతో క్షణికావేశానికి లోనైన యువకుడు సొంత తండ్రితో పాటు సవతి తల్లిని కిరాతకంగా కత్తితో నరికి చంపిన దారుణ ఘటన బొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. గజపతినగరం సీఐ ఎన్.వి.ప్రభాకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డోల రాము(52)కు గతంలో లక్ష్మితో వివాహమైంది. ఆమెకు నిందితుడు లక్ష్మణరావు(26)తో పాటు, పెద్ద కొడుకు పైడిరాజు ఉన్నారు. మొదటి భార్య వేరే పెళ్లి చేసుకోవడంతో కొన్నేళ్ల కిందట రాము కూడా బొండపల్లి మండలంలోని గిట్టుపల్లి గ్రామానికి చెందిన జయలక్ష్మి(49)ని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి 13 సంవత్సరాల వయస్సు ఉన్న కుమార్తె ఉంది. తండ్రి, సవతి తల్లి నివసిస్తున్న ఇంటికి సమీపంలో రేకులషెడ్డు వేసుకొని నిందితుడు వేరేగా జీవనం సాగిస్తున్నాడు. నిందితుడికి, హత్యకు గురైనవారికి కొంతకాలంగా కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. అదే కోవలో శుక్రవారం ఉదయం ఘర్షణ పడ్డారు. ఇది కొట్లాటకు దారితీసింది. లక్ష్మణరావు ఇంటిలోని కత్తిని తెచ్చి తండ్రి రాముపై విచక్షణా రహితంగా దాడిచేశాడు. అడ్డుగా వచ్చిన సవతి తల్లిని కూడా నరికేశాడు. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఘటనా స్థలాన్ని ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఎం.జావలీతో పాటు, బొండపల్లి, గజపతినగరం పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు కె.లక్ష్మణరావు, యు.మహేష్ పరిశీలించారు.




హత్యకు గురైన రాము (ఫైల్), జయలక్ష్మి(ఫైల్)



అనాథగా మారిన జయలక్ష్మి, రాముల కుమార్తె చంద్రిక

మృతదేహాలకు శవపంచనామా జరిపి పోస్టుమార్టం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల మృతితో బొండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కుమార్తె చంద్రిక అనాథగా మారింది.

పరుగు తీసిన జనం

చిన్నపాటి గొడవ ఇద్దరి హత్యకు దారితీసిన ఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందారు. పరుగు తీశారు. నిందితుడు లక్ష్మణరావు విద్యుత్ పనులు చేయడంతో పాటు ఇటీవల ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడికి ఎటువంటి అలవాట్లు లేవని, ఒక్కసారిగా హత్యకు పాల్పడడంతో ఆశ్చర్యచకితులవుతున్నారు. హత్యచేసిన తర్వాత నిందితుడు కాసేపు అక్కడే ఉండి తర్వాత పరారయ్యాడు. అయితే, పోలీసులు గాలించి అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.